# పందెగాలి - ఆదూరి వెంకటసీతారామమూర్తి




వాకిట్లో నందివర్ధనం చెట్టుక్రింద వాలుకుర్చీలో కూర్చొని ఆకాశంలోని పిట్టల్ని లెక్కపెడుతూన్న వెంకటేశంగారు ఎదుటి గోడమీద ఎండ ముదరడంతో ఆలోచనలకు స్వస్తిచెప్పి గది కిటికీ లోంచి వంటింట్లోకి చూశారు వంటింట్లో సీతామాలక్ష్మి ఉన్న జాడ కన్పించలేదు పెరట్లో నూతి చపటామీద గిన్నెల చప్పుడుమాత్రం విన్పిస్తోంది.

ఉస్సూరుమంటూ మళ్ళీ ఆ పాతకాలపు వాలు కుర్చీలో చేరగిలబడ్డారు ఉదయాన్నే కాఫీకి అలవాటు పడ్డ ప్రాణం గిలగిల్లాడిపోతోంది — ఈనాటిదా యేమిటా అలవాటు ? పాతికేళ్ళనుండీవుంది ఒక్కసారిప్పుడు మానుకోవాలంటే ఎలా ? అదీ యింత వయసొచ్చాక.

"పాతబాకీ చెల్లువేయలేదు రేపట్నించి ఒక్క చుక్కపాలు కూడ పొయ్యలేను నాదీ బతుక్కోసం చేసే యాపారమే" అని, క్రితంరోజుచెప్పి, అల్లరిచేసి పోయాడు సైకిల్ పాలవాడు.

నిజమే నాలుగు నెలల్నించీ ఒక్కపైసా కూడ యిచ్చిన పాపాన పోలేదు అన్నప్రకారమే యీరోజు పాలు పోసినట్టులేదు వెధవది .తెల్లారకముందే లేచే అలవాటు — వాకిట్లో కూర్చొని ఆకాశంలో వచ్చే వెలుగునీ, ఎగిరే పిట్టల్నీ చూస్తూ ఎంతసేవు గడిపినా తెల్లారలేదు తీరా తెల్లారి, ఎర్రగా ఎండొచ్చాక గుర్తొచ్చింది—పాలవాడు పాలుపొయ్యలేదన్న సంగతి.

గుమ్మంముందు నీళ్ళు జల్లి ముగ్గేస్తోంది భవాని. తల్లిలాగే చీకటింటలేవడం, పనులు చేసుకోడం కూతురికీ అలవాటే

'అమ్మా భవాని' అని పిలిచేరు—భవానీ వచ్చింది.

'అమ్మ ఏం చేస్తోందీ' అడగాలనుకున్నది అడగలేక మరేదో అడిగారు.

'పెరట్లో నీళ్ళు తోడుతోంది నాన్న'

వెంకటేశంగారికా సమాధానం సంతృప్తిని కలిగించలేదు.

పాలవాడిమీద కోపమొచ్చింది — రెండేళ్ళబట్టీ పోస్తున్నాడు వాడికగా ఎప్పుడన్నా బాకీపెట్టడం జరిగిందా ? ఒక్క రెండు నెలలిటూ అటూ అయినా పైసా తేడా రాకుండా లెక్కకట్టి యిచ్చేసేవాడు.

పిల్లలు పెరిగారు — ఖర్చులు పెరిగాయి — ఆదాయం తగ్గిపోవడంతో కొన్ని ఖర్చులు తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కసారి అరలీటరు పాలు తగ్గించడంతో వచ్చింది అసలు పేచీ.

వెంకటేశంగారి · కడుపులో కరకరలాడ్డం మొదలైంది.

ఇక కుర్చీలో కూర్చోలేక లేచి కిటికీలోంచి లోపలికి చూశారు. పెద్దకొడుకు సుందరం మంచం మీద పడుకొని యేదో పుస్తకం చదువుకుంటున్నాడు.

ఆఖరి పిల్లలిద్దరూ యింకా నిద్రలేవనేలేదు వాళ్ళు లేచాకనే మొదలౌతుంది అసలు అల్లరంతా.

వెంకటేశంగారికి పాల గురించి ఏం చేయడానికీ పాలుపోలేదు ఒకప్పుడు బాగా బతికాడని కాదుగానీ స్కూలు మాష్టరిగా చేసినన్నాళ్ళూ రోజులేవో దొర్లుకుపోయాయి — ఆ సంపాదలోనలోనే కొడుకు బియ్యే చదివేడు కూతురు పదో తరగతి అయిందని పించి అక్కడితో ఆపింది — బియ్యే కొడుకు కనీసం బియ్యపు గింజైనా తేలేని స్థితిలో నిరుద్యోగాన్ని వెలగబెడుతున్నాడు

'మీకేం మా రాజులు రిటైరయ్యే వేళకి కొడుకు అందుకుంటాడు కాలుమీద కాలేసుక్కూచుంటే రోజులెళ్ళిపోతాయి' అనేవారు బంధువులు, చదువులో ఫస్టు మార్కులు తెచ్చుకునే సుందరాన్ని చూసి

సుందరం తెలివైనవాడే గుణసుందరుడే కానీ ఆ విషయం తను గుర్తిస్తే చాలదు—ఏ ఇంటర్వ్యూలోనైనా గుర్తింపుకొస్తే ఫలితముండేది!

మళ్ళీ కుర్చీలో కూలబడ్డారు వెంకటేశంగారు ఎదురింటి కంట్రాక్టరుగారు స్కూటర్ బయట పెట్టి భార్యతో యేదో మాట్లాడుతున్నారు ఆయనకీ తన వయస్సే వుంటుంది కానీ తనలా విశ్రాంతిగా ఒక్క క్షణం కూర్చోరు. ఉదయంనించి అర్థరాత్రి వరకూ ఏదో ఒక పనిమీద తిరుగుతూనే వుంటాడు చాలినంత సంపాదన, ఆరోగ్యం, ఆనందం వీటితో హాయిగా వున్నాడనిపిస్తుంది — ఆరేళ్ళక్రితం తామీ యింటికొచ్చేసరికి వాళ్ళకి చిన్న డాబా యిల్లు వుండేది—ఈ ఆరేళ్ళలోనూ ప్రభుత్వ కంట్రాక్టుల పుణ్యమాని ఆ పక్కనున్న ఖాళీ జాగా కూడకొనుక్కొనిమొత్తం స్థలంలోపెద్ద మేడలేపేడు

కష్టపడి నెల జీతాలకు పని చేసేవాళ్ళకు ఆస్తులెలా మిగుల్తాయి? అద్దెయిళ్ళలో అద్దె కూడ యిచ్చుకోలేని పరిస్థితి ఎదురైందంటే అవదూ? వెంకటేశంగారికి యింటిగలాయన జ్ఞాపకానికొచ్చాడు చాలా సౌమ్యుడు, ఉత్తముడు, మధ్య తరగతి వాళ్ళ సాధకబాధకాలు తెల్సిన మనిషీను — ఆయనన్నట్లా అనుకోడానికి కారణం ఒక్కటే — ఈ ఆరేళ్ళలోనూ దేశంలోని ఎన్నిధరలెలా పెరిగినా అద్దెఒక్కరూపాయి కూడ పెంచలేదాయన అటువంటివాడు నిన్న సాయంత్రంవచ్చిఅతినెమ్మదిగానేచెప్పేడు నిజమేమరి! ఎంత అద్దె డబ్బులతో బతకనివాడైనా నాలుగు నెలల్నించీ అద్దె యివ్వకపోతే కష్టమన్పించదూ? తనకీ కష్టంగానేవుంది ఇన్నాళ్ళూ మాష్టారూ మాష్టారూ అంటూ గౌరవించడమే తప్ప తనతో ఎప్పుడూ మరోమాట మాట్లాడలేదు—వెధవది డబ్బులేకపోబట్టి చులకనైపోతున్నాడు ఈ యిల్లు ఖాళీచేస్తేయింత మంచి యింటిగలాయన గల యిల్లు యింత చవకలో దొరకొద్దూ? ఈ యిల్లు కదిలితే వీధిన పడిపోతాడు

వెంకటేశంగారు తల గోక్కున్నారు ఎవరికాళ్ళో పట్టుకుని రెండు నెలల అద్దెయినా యిచ్చేస్తే గాని పరువు దక్కదు

'నాన్నా కాఫీ' అంటూ కాఫీ గ్లాసుతో ఎదురుగా నిల్చుంది భవాని

ఆశ్చర్యంగా చూసి, యేదో అడగాలనుకున్న



వాడల్లా దానివల్ల తన అసమర్థతే మరోమారు నిరూపించబడుతుంది తప్ప ఒరిగేదేం వుండదనుకుని ఆ పని నుండి విరమించుకున్నాడు

కాఫీ వేడి వేడిగావుంది రుచిగా కూడ వున్నట్లనిపించింది. ఒంట్లో కాస్త సత్తువజేరింది

సీతామాలక్ష్మి తనను బాగా అర్థం చేసుకున్న యిల్లాలు తన అవసరాలేమిటో తెల్సుకుని అడక్కుండానే అన్నీ సమకూరుస్తుంది

గుమ్మంలోకి ఎండ బాగా వచ్చేసింది ఎదురింటి రేడియోలోంచి ఏదేదో విన్పిస్తోంది గేదెకి కుడితెంత పెట్టాలో ఏ మొక్కకెంత నీరుపెట్టాలో ఏ జిల్లాలో ఎంతమంది స్త్రీలకి లూపులమర్చేరో ఎవరిక్కావివి పొద్దున్నే?

కుర్చీ మడిచేసి ముందు గదిలోకొచ్చేరు వెంకటేశంగారు ఆఖరి పిల్లలిద్దరూ నేలమీద కూర్చుని హోంవర్కులు చేసుకుంటున్నారు. సుందరంవంక చూడ్డానికి భయమేసిందాయనకు ఎరువుతెచ్చుకున్న ఏ యింగ్లీషు నవలో చదువుతూ వుంటాడు తెలివైనవాళ్ళకి మంచి అవకాశాలు రాక బతుకు తెరువు యేర్పడకపోతే విప్లవకారులగానో, తిరుగుబాటుదారులుగానో మారిపోతారట సుందరం కూడ అలా మారిపోతే తను భరించగలడా? ఊళ్ళూ దేశాలూ పట్టిపోయి, పోలీసులకు చిక్కి, లాఠీదెబ్బలు తింటూ జైలుశిక్షలు అనుభవిస్తూంటే తను బతికుండే ఆ వార్త వినగలడా? తన కుటుంబ పరువూ ప్రతిష్ట ఏం కావాలి?

వెంకటేశంగారి దృష్టి ఎదురింటి మేడమీద పడింది కంట్రాక్టరుగారమ్మాయి శారద అప్పుడే లేచిందిలావుంది నైట్ గౌన్లో వుండి బ్రష్‌తో పళ్ళు తోముకుంటోంది శారదకూడ భవానీ యీడుదే కానీ శారదలోవుండే ఆ నవకం, వయసుతెచ్చేపుష్టీ భవానీలో కన్పించవెంచేతో? శారద మెడిసిన్ చదువుతోంది రేప్పొద్దున్న యే స్పెషలిస్టో అయి, వేలకు వేలు ఆర్జించిపోస్తుంది కన్నవాళ్ళూ సంతోషిస్తారు కట్టుకున్నవాడూ సంబరపడతాడు

లోపల గదిలో దేవుడి ముందు గంటమోగింది వెంకటేశంగారి దృష్టి అటువైపు మళ్ళింది — భార్య పూజ చేస్తోంది ఎట్టి పరిస్థితిలోనూ ఆవిడ దేవుడి ముందు దీపం పెట్టడం మానదు — నూనె ధర ఆకాశాన్నంటి యింట్లో వాడికకే కరువైపోయినా దీపారాధనకి మాత్రం యే లోటూ చెయ్యదావిడ ఇంట్లో ఎవరి కళ్ళలో వెలుగు తగ్గినా ఆ దేవుడి ముందు మాత్రం వెలుగు తగ్గదు — ఆయనే యేదో తమ జీవితాల్లోకి వెలుగు చూపిస్తాడని సీతామాలక్ష్మి ఆశ.

పిల్లలు స్నానాలుచేసి బళ్ళోకి వెళ్ళిపోయారు

సుందరం కూడ తండ్రి ముందునించి ఒకట్రెండు మార్లు తిరిగాడు కానీ వెంకటేశంగారు అతగాడిని చూడనట్టే కళ్ళు మూసుకున్నారు రెండురోజుల క్రితం సుందరం అడిగేడు — 'నాన్నా బేంక్‌లో ప్రొబేషన్ ఆఫీసర్ ఉద్యోగ ప్రకటన పడింది. దరఖాస్తు పెట్టనా' అని — తన పిల్లలు తనను అడగందే ఏ పనీ స్వతంత్రించి చేయరని వెంకటేశంగారికి గర్వం

'పెట్టవోయ్' అన్నారేగాని ఆ తర్వాత వినవచ్చే మాటకు తట్టుకోగలడా? లేడా? అనేభయం లోలోపల వుండనేవుంది

'పాతిక రూపాయల పోస్టలార్డరు పంపాలి' అనేసి తలొంచుకున్నాడు సుందరం పరిస్థితుల్ని అర్థం చేసుకుని అడగటం మానెయ్యనూలేదు అర్థం చేసుకోనట్లు ప్రవర్తించనూలేదు అదీ సుందరం పరిస్థితి

డబ్బు కడితే కొడుకు వ్రాత పరీక్షలో తప్పకుండా సెలక్టు అవుతాడన్న ధైర్యముంది వెంకటేశంగారికి కానీ కడదాంలే అని ధీమాగా చెప్పలేదు ఒకవేళ కట్టినా, వ్రాత పరీక్షలో నెగ్గిన కొడుకు ఏ రికమండేషనూ లేకుండా కేవలం మెరిట్‌లో ఉద్యోగాన్ని సంపాదించుకోగలడా అంటే అది అపనమ్మకమే కాస్సేపేం మాట్లాడలేకపోయారాయన ఆ తర్వాత 'చూద్దాంలే' అన్నారు అప్పటికా పరిస్థితి నుండి తప్పించుకున్నారేగాని తర్వాత సుందరం కన్పించినపుడల్లా అదే తలలో మెదుల్తోందాయనకు

చెప్పులేసుకుని సుందరం ఎక్కడికో వెళ్ళిపోయాడు ఎంత పైకి కన్పించనీయకపోయినా కన్నందుకు తండ్రి తనకేం చేయలేదన్న ఉక్రోషం వాడిలో వుండే వుంటుంది

నిజంగా తను అసమర్థుడే — రిటైరై ఆర్నెల్లయినా తన పెన్షన్ డబ్బులు తనే తెచ్చుకోలేకపోయాడు

ఆలోచనల్లోంచి తప్పించుకునేందుకు పక్కింటి నించి దినపత్రిక తెప్పించుకున్నారు వెంకటేశంగారు.

ప్రేమించినవాడు మోసంచేస్తే ఫేనుకి ఉరి పోసుకు చనిపోయిన ఆడపిల్ల

ఎమ్మే పట్టాని ఏడేళ్ళయిమోస్తూ కుటుంబానికిక భారంకాలేక నిరుద్యోగపర్వాన్నీ, నూరేళ్ళ జీవితాన్నీ మధ్యలోనేబలవంతంగా ఆపేసుకున్ననిరుద్యోగి.

కడుపుచించుకు పుట్టిన పిల్లలు అన్నమో రామచంద్రా అని ఆర్తనాదం చేస్తుంటే ఒడ్డు తెలీని ఆ సంసార సాగరంలో యిక ఈదలేక విషం మింగి కష్టాలు గట్టెక్కాయనుకున్న మాతృమూర్తి

ఆత్మహత్యలు ఆత్మహత్యలు ఎన్నెన్నో ఆత్మహత్యలు!

ఏ రోజు ఏ పేపరు చూసినా యివే వార్తలు!

అసమర్థుల సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారమా?

వెంకటేశంగారు బాగా ఆలోచించారు. తనొక్కడూ చచ్చిపోయినంతమాత్రాన తనకుటుంబం యొక్క కష్టాలు ఒక్కమారు గట్టెక్కిపోవు. గట్టెక్కిపోతాయనుకుంటే తను చచ్చిపోవచ్చు. బంగాళాఖాతంలోపడి ఘోరమైన చావు చావొచ్చు తండ్రి చనిపోతే కొడుక్కి ఉద్యోగమిచ్చే సంస్థలున్నాయిట ఈ బడిపంతులు ఉద్యోగానికిబదులు తను అటువంటి సంస్థలో కళాసీ పనిచేసివున్నా బాగుండేది.

కానీ కుటుంబ చరిత్ర, పరువు ప్రతిష్టలూ, గౌరవ మర్యాదలు?

వీటిన్నె రక్షించుకోవద్దూ?

ఎదురింటి గేటు చప్పుడైతే అటువైపు చూశారు వెంకటేశంగారు. కంట్రాక్టరుగారి పెద్దబ్బాయి కొత్త స్కూటర్‌మీద వెళ్ళిపోతున్నాడు.

కంట్రాక్టరుగారి యిద్దరి కొడుకులకీ చదువబ్బలేదు. వాళ్ళతో పోలిస్తే సుందరం ఎంతో తెలివైనవాడు. అవకాశం రాకగానీ జిల్లా కలెక్టరై పోగల యోగ్యత లున్నాయి వాడిలో.

భారంగా నిట్టూర్చారు

'నాన్నా వంటయింది—స్నానానికి లేవమంటోంది అమ్మ' భవానీ వచ్చింది.

లేచి తువ్వాలు తీసుకుని పెరట్లోకి వెళ్ళేరు. మాతి చపటా ఖాళీగా వుంది నాలుగు చేదల నీళ్ళు తోడుకుని తలమీంచి పోసుకుంటే ఎంతో హాయని పించింది

"ఒసే పార్వతీ – నేను జయవాణి ఆల్బమ్ చేశాను చూస్తావా" పక్కింటి వాళ్ళమ్మాయి రాజ్యం స్నేహితురాలితో అంటోంది

"ఓ – ఎక్కడివే నీ కన్ని ఫోటోలు ?"

'సంపాదించాను మనసుంటే మార్గమే వుండదా కొన్ని కలర్ ఫోటోలు కొన్నాను కూడ !'

'అబ్బ ! చూపించవే '

'నిన్న రిలీజైన ప్రేమకాపురం సినీమాలోది కూడ సంపాదించాను అందులో ఎంత బావుందను కున్నావ్. ముద్దొస్తూ '

వెంకటేశంగారు స్నానంచేస్తూ ఆ సంభాష ణంతా విన్నారు

రాజ్యానికి సినీమాల పిచ్చి !

ఈ కాలపు పిల్లలు సినీమాలు చూసి పాడై పోతున్నారు.

కానీ తన పిల్లలో ? ఎవరితో పోల్చినా బంగారబ్బొమ్మలు !

సినీమాలూ షికార్లూ ఎరుగరు — అలా పెంచాడు తను !

తన పెంపకంమీద తనకే గర్వం కలిగింది వెంకటేశంగారికి.

స్నానం, భోజనం అయ్యేక సావిట్లో మంచం వాల్చుకుని నడుం వాల్చేరు ఆలోచన్ల మధ్య చిన్న కునుకు పట్టేసింది. మెలుకువ వచ్చేసరికి మూడు. వీధివైపు నీడ ప్రహారీ గోడవరకూ వెళ్ళింది కాసిన్ని మంచినీళ్ళు తాగి, వాలుకుర్చీని వాకిట్లో వేసు క్కూర్చున్నారు

చేసేపని లేకపోయినా విశ్రాంతిలేదు రోజంతా ఆలోచనలే — పిల్లల్ని గురించీ భవిష్యత్తును గురించీ.

మరో గంటలో ప్రయివేటు పిల్లలొస్తారు

"బాబూ చింతపండు కావాలా" ఎవరో అమ్మకునేవాడు వీధిగుమ్మంలో నిల్చుని అడుగు తున్నాడు.

"ఒద్దు "

"అమ్మగార్నడిగి సెప్పండయ్యా" వదల్లేదు వాడు నిజానికింట్లో చింతపండు లేదు — కానీ డబ్బులుండొద్దూ కొనడానికి ?

"నాకు తెల్సులేవయ్యా అక్కర్లేదు వెళ్ళు" వాడు వెళ్ళలేదు — గేటు తీసుకుని సరాసరి లోపలి కొచ్చాడు

"బాబూ ! మీరు వెంకటేశం పంతులుగారు కాదా" అన్నాడు అనుమానంగా ముఖంలోకిచూస్తూ.





మీరు నిత్యం ప్రేమించే సువాసన
లావణ్యా
బ్యూటీ టాల్కమ్ పౌడర్
HIRUSAH ENTERPRISES
KANCHIPURAM-631 501

భారతి
సాహిత్య
మాసపత్రిక
తెలుగువారి
సంస్కృతికి
ప్రతిబింబం
విడి పత్రిక: రూ. 4-00

"పేరు కూడ కనుక్కున్నావన్నమాట ! ఏం కావాలి?"

"ఎన్నాళ్లయిందిబాబూ చూసి. గొంతునుబట్టి పోల్చుకున్నాను నన్నెరగరా? రావుల్ని పాలెంలో వుండేవాణ్నిగా"

ముఖంచూసి పోల్చి పట్టలేకపోయినా వివరాలు చెప్పేసరికి గుర్తుకొచ్చింది వెంకటేశంగారికి

'నువ్వా రావులూ ఏవిటిలా ఈ వూరొచ్చావ్? నీకు పొలం పుట్రా వుండాలిగా అక్కడ?'

'వున్నాయయ్యా. కొడుకులు పిలిస్తేనూ ఒచ్చేసినా'

పాతముచ్చట్లూ, పాలెం సంగతులూ కాస్సేపు మాట్లాడుకుని తృప్తి పడ్డారిద్దరూ

"ఇక్కడ నీ కొడుకు లేం చేస్తున్నారూ?"

"పెద్దాడిది యాపారం బాబూ బడ్డీ కొట్టుంది కూరలూ, కిరాణా అమ్ముతాడు బాగానే సంపాయిస్తున్నాడు రెండోవాడు పదోతరగతి పేసయ్యేడు ఆనక సదవన్నాన్నా అన్నాడు సర్లేకాని నాలుగొందలు మదుపిచ్చినాను యేదేనా యాపారం జేస్కోమని కానీ ఆడికి నిలకళ్ళేదు, ఏడాదిలో నలుగురికాడ నాలుగు రకాలుగా మారేడు సంపాయించే శ్శిండి ఇప్పుదు బేంకీ లోను తీస్కొని సోపాల్తేస్తన్నాడు ఒక్కో సోపా ఆరేడొందలంట — ఇద్దరు పనోళ్ళను బెట్టేడు బాగానే మిగుల్తాది"

"మరి యిద్దరు కొడుకులూ సంపాదిస్తుండగా నీకెందుకీ వ్యాపారం పాలెంలోని ముక్క చాల్దా?"

"కొడుకుల సంపాదనమీద ఆశపడకూడదు బాబూ అళ్ళుండమంటారు తినమంటారు కొత్తల్లో మనకీ బాగానే వుంటది. తరవాత్తరవాత కూకుని తినేవోణ్ణి చూస్తే కొడుక్కేనా కన్ను కుట్టుద్ది. నానీ వూరొచ్చిన కొత్తలో అలాగే కొన్నాళ్ళు కూకొని తిన్నా—కోడలూ మంచిదే కానీ నాకు ముగ్గురు కూతుళ్లున్నారు పెద్దదానికి పెళ్ళిచేసేను ఇద్దరున్నారింకా పెళ్ళికి కొడుకులు నా కెడతారని కూకుంటే కూతుళ్ళ మద్దూ ముచ్చట్లు తీరేదెప్పుడు? చిన్న కొడుక్కి పెళ్ళి కాలేదు కానీ పైసా చేతికివ్వడాదు ఇక్కడ చింతపండు యాపారం లాభసాటిగా వుంటది నాన్నా అన్నవాడు వాడే—ధైర్యంచేసి, పెట్టుబడెట్టి, కొని అమ్మేను బాగానే మిగిలింది అంతే! నా భార్యనీ, ఆడపిల్లల్నీ కూడదీసుకొచ్చి వేరే పాక అద్దెకు దీసుకుని కాపరమెట్టేను ఎందుకు నాన్నా మరో యిల్లు అన్నాడు పెద్దోడు నీకు తెల్దురా. కానీ లే అన్నాను. వూరుకున్నాడు ఆడుట్టి ఖర్చుమనిషి బాబూ. పంకా కొన్నాడు. రేడియో కొన్నాడు. అయ్యేందుకురా ఏ మడి చెక్కో కొనుక్కోమన్నా ఆడి చెవి కెక్కలేదు కోడలిపిల్లక్కూడ చెప్పి చూసినా. నీ మొగుడిచేత ఏ బంగార ప్పిసరో కొనిపించుకో ముందు ముందు పనికొస్తాదీ అని — అబ్బే — దాని మాటా ఆడిన్లేదు — ఆడికే తెలుస్తాదిలెండి. ఇప్పుడా రోజా కూరిస్తాడు కాయో పండో యిస్తాడు నాన్నా అంటూ పలకరిస్తాడు ఆళ్ళు బావుంటే అంతేచాలు. నా కంటారా. యిదే బావుంది యే కొడుకూ పెట్టక్కర్లేదు. ఇద్దరూ కళ్ళముందున్నారు యాపారం బాగానే వుంది. నా భార్య పొద్దున్నే యిడ్లీ పెట్టి యింటికాడే అమ్ముతాది అన్నీ ఒమ్మితే రెండున్నర మిగుల్తాది లేదూ అమ్మకం కాకపోయినా నష్టంలేదు పిల్లలు తింటారు. ఏదో బతుగ్గడవడానికి నలుగురం నాలుగు పన్లూ చేసుకుంటన్నాం" రావులు చెప్పడం ఆపి లేచాడు

"బాగుందోయ్ అంతా బాగున్నారంతే చాలు ఒక వూరివాళ్ళం నిన్నీరోజు చూడ్డం చాల సంతోషంగా వుంది' అన్నారు వెంకటేశంగారు

రావులు వెళ్ళేక ఆలోచనలో పడ్డారు

సాయంకాలమైంది ప్రయివేటు పిల్లలకి ఏదో చెప్పి పంపించేసి వీధిలోకి బయల్దేరేడు వెంకటేశంగారు కాస్త దూరం నడిచి మెయిన్ రోడ్డు ఎక్కేసరికి సముద్రపొడ్డుకి వెళ్ళాలనిపించింది కాలి నడకనే వెళ్ళి జనమెవ్వరూలేనిచోట ఇసుకలో కూర్చొని కెరటాల వంక చూస్తూ వుండిపోయారు చాలాసేపు

ఆయన మనసంతా అల్లకల్లోల కడలిలావుంది తను చూసిన మానవ జీవితాన్ని మూడు తరగతులుగా విభజిస్తే తనది మధ్య తరగతి మరి సమాజంలో తమ స్థితి చూస్తే అధమంగానేవుంది. దీని క్కారణం ఆదాయం తక్కువయి ఆర్థికంగా చితికిపోడం — పరువు, మర్యాదలంటూ స్తోమతకు తగిన జీవన విధానాన్ని ఎంచుకోకవడం — ఒక్కరు సంపాదిస్తే కుటుంబమంతా కూర్చొని తినడం

ఇట్కుకింది తరగతికి చెందిన రావులు కుటుంబాన్ని చూస్తే .. అవసరాలకు తగ్గట్టు అందరూ ఆర్జిస్తున్నారు ఈ పని కూడదూ అనే నిబంధనలేదు

అటు పైతరగతికి చెందిన కంట్రాక్టరు గారింటకూడ ఆయన భార్య తీరిక వేళల్లో ఎంబ్రాయిడరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది పెద్దకొడుకు తండ్రికి సహాయకారిగా వుంటూ ఆ పనిలోని మెలుకువలు నేర్చుకుంటున్నాడు

రెండో అబ్బాయికీ చదువబ్బకపోయినా బిల్డింగ్ మెటీరియల్ సప్లయ్ చేసే షాపు పెట్టుకున్నాడు

మధ్యస్తంగా వుందనుకున్న తన కుటుంబం చూస్తే తెలివిగా, చదువుకున్న సుందరాని కుద్యోగంలేదు ఎంప్లాయ్‌మెంట్ ముదుపులకీ, పోస్టల్ ఆర్డర్స్‌కీ కూడ తండ్రినే యాచించుకోవాల్సిన గతివాడిది

'ఈ పాట్లు పడినా నా కుద్యోగం రాదు సుబ్బరంగా ఏ కిల్లీ బడ్డీయో పెట్టేసుకుంటాను బే.కు లోను తీసుకుని' అన్నాడోమారు. తనూ, సీతామాలక్ష్మి కూడ తలవాచేట్లు చివాట్లుపెట్టేరు ఆ ఆలోచనకి సాంప్రదాయ కుటుంబంలోంచి వచ్చి, నలుగురికీ విద్య నేర్పించే మాష్టారుగారబ్బాయి చుట్టాబీడీ లమ్ముకునే వాడుగా జీవితంలో స్థిరపడ్డమా? వెధవడబ్బు . వేశ్యలుకూడ సంపాదిస్తున్నారు వందలకి వందలూ — అది కాదు జీవితంలో కావల్సింది — అనుకున్నాడప్పుడు

ఆ డబ్బులేకే అసమర్థుడిగా మారిపోయాడిప్పుడు మరి ఈ అసమర్థుడు రేపు ఆడపిల్లల పెళ్ళిళ్లెలా చేస్తాడు? ఆకాశాన్నంటేంత ధనరాశి పోసి అల్లుళ్ళనెలా తెచ్చుకోగలడు?

భవానీ కూడ అణుకువగల పిల్ల — చదువబ్బకపోయినా కత్తిరింపులూ, మిషన్ ఎంబ్రాయిడరీలూ, కుట్లూ నేర్చుకుంది —

'తప్పేంలేదు నాన్నా ఒక మిషన్ కొంటే మన బట్టలతోపాటు చుట్టుపక్కలవారివికూడ కుట్టొచ్చు నాకూ వూసుపోతుంది!' అందొకనాడు— పుట్టింట ఆడపిల్ల సంపాదించడం అంత సబబు కాదనిపించింది — అందుకే ఆ విషయం మళ్ళీ తనముందు తేకుండా చేసేడు —

అయితే తమచుట్టూ గీసుకున్న యీ పరువు ప్రతిష్టల గిరులమధ్య జీవితాలు కుంచించుకుపోయి, యిక ఎన్నటికీ ఎదగలేనివిగా తయారైతే చూస్తూ వుండిపోగలడా?

ఒక దృఢమైన నిశ్చయానికొచ్చిన వెంకటేశం గారు లేచి, వడివడిగా యింటివైపుకు నడిచేరు

ఇంటికి వెళ్ళగానే బట్టలుకూడ మార్చుకోకుండా వాలుకుర్చీలో కూర్చొని కొడుకునీ, కూతుర్నీ దగ్గరకు పిలిచేరు — సుందరం, భవానీ ఆశ్చర్యంగా తండ్రి దగ్గరకొచ్చారు

సీతామాలక్ష్మి దూరంగా నిల్చునే గమనిస్తోంది—

'చూడొరే సుందరం ఆమధ్యేదో బేంకు లోను విషయం మాట్లాడేవుగా నీకిష్టమైతే చెప్పు — శంకరం అని చిన్నప్పుడు నా దగ్గరే చదువుకున్నాడా బేంకు మేనేజరు ఆ మాత్రం సాయం చేయకపోడు— భవానీ క్కూడ కుట్టుమిషన్ కావాలని అంది ఆ సంగతి కూడ అప్పుడే కదుపుతాను!' అని, పిల్లల ముఖంవంక చూడకుండా ఆకాశంలో అప్పుడే ఉదయిస్తున్న చంద్రుడి వంక చూశారు —

భవానీ, సుందరం ఒకరి ముఖాలొకరు చూసుకుని తల్లివంక చూశారు — వాళ్ళ కళ్ళలో ఆనందం చిలికింది —

'మీరేం అనుకోకపోతే . మరో సంగతికూడ చెప్పాలనుకుంటున్నా నాన్నా' నసిగేడు సుందరం

ఏవిటన్నట్లు చూశారు వెంకటేశంగారు కొడుకువైపు

'నాకు నామోషీ లేకపోయినా నాకు బియ్యే డిగ్రీ నిచ్చిన యూనివర్సిటీని కిల్లీకొట్టుకు లాగి నేను కించపరచదల్చుకోలేదు అంచేతే మెట్రిక్ నుండి బియ్యే వరకూ ప్రయివేటుగా వెళ్ళే విద్యార్థుల కోసం కరెస్పాండెన్స్ కోర్సు పెట్టదల్చుకున్నాను — దీనికి నా మిత్రులు కొందరు సాయపడుతున్నారు. మీరు ఊఁ అంటే 'ఆగేడు సుందరం వెంకటేశం గారి కళ్ళు ఆనందంతో మెరిశాయి అన్ని దానాలకన్నా విద్యాదానం గొప్పది —

'ఎంబ్రాయిడరీ స్కూల్లో కొత్త టీచర్ని వేసుకుంటారట — యీరోజే అడిగారు వాళ్ళు నన్ను' భవానీ చెబుతోంది

వెంకటేశంగారి హృదయంలో ఆనంద కెరటాలు ఎగిరిపడ్డాయి — గుండెల్లోంచి వినవచ్చే ఆ హోరులోంచి అతని గొంతు అంగీకారంగా ధ్వనించింది — అతని కళ్ళలో చిప్పిల్లిన నీటి బిందువుల్లో ఆనాటి పున్నమివెన్నెల మెరిసింది —

సందెగాలి వారిమధ్యనుండి ఆనందంగా కదిలింది. ★